AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

3-11-2026 (Tuesday)

MAIN EDITION

నిధుల కేటాయింపులో వివక్ష..



అక్షరటుడే, నల్గొండ : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నిధుల కేటాయింపులో మంత్రి ఉత్తమ్ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఆయన హుజుర్‌నగర్ కు మంత్రా.. లేక రాష్ట్రానికి మంత్రా అని ప్రశ్నించారు. నిధులను కోదాడా, హుజుర్‌నగర్‌కు తీసుకు వెళ్తున్నారని, ఇతర నియోజకవర్గాలను పట్టించుకోవడం లేదన్నారు. తాను ప్రతిపాదనలు పంపినా నిధులు ఇవ్వడం లేదన్నారు.

రాప్తాడు నిందితుడి కుడి కాలు తొలగింపు



అక్షరటుడే, ఏపీ : అనంతపురం జిల్లా రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై దాడి చేసిన నిందితుడు హేమంత్ కుడి కాలును వైద్యులు తొలగించారు. నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. రెండు కాళ్లలో బుల్లెట్లు దిగాయి. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడిని కుడి కాలును వైద్యులు ఆపరేషన్ చేసి తొలగించారు. నిందితుడి దాడిలో గాయపడ్డ విద్యార్థి కోలుకుంటోందని వైద్యులు తెలిపారు.

లంచం తీసుకుంటూ దొరికిన వ్యవసాయ అధికారి



అక్షరటుడే, మెదక్ : సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల వ్యవసాయ అధికారి ఏసీబీకి చిక్కాడు. ఏవో జి. రమేష్ ఓ వ్యక్తి నడుపుతున్న ఎరువుల వ్యాపారం సజావుగా, ఇబ్బందులు లేకుండా సాగడానికి లంచం డిమాండ్ చేశాడు. బాధితుడి నుంచి రూ.30 వేల లంచం డిమాండ్ చేశాడు. అందులో రూ.10 వేలు అక్టోబర్ 19న తీసుకున్నాడు.

జీహెచ్ఎంసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : జీహెచ్ఎంసీ అసిస్టెంట్ డైరెక్టర్ యాదగిరి రావు నివాసంలో సోదాలు చేపట్టింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై ఏసీబీ అధికారుల దర్యాప్తు చేస్తున్నారు. ఉప్పల్‌లోని హైకోర్టు కాలనీలో ఉన్న నివాసంతో పాటు, సూర్యాపేట ఇతర ప్రాంతాల్లోనూ ఏకకాలంలో సోదాలు చేపట్టింది.

విద్యుత్ ఇవ్వలేకపోతున్న ప్రభుత్వం : జగదీశ్‌రెడ్డి



అక్షరటుడే, హైదరాబాద్: రాష్ట్రంలో 27 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం 20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా ప్రభుత్వం విద్యుత్ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. అకస్మాత్తుగా డిమాండ్ పెరిగిందని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

పదేళ్ల కొడుకును బలి తీసుకున్న తండ్రి

అక్షరటుడే, గుజరాత్: మూఢ నమ్మకాలతో ఓ తండ్రి తన పదేళ్ల కుమారుడిని హత్య చేశాడు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ జిల్లా వించియా గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తి తాంత్రికుడిగా (స్థానికంగా 'భువ' అని పిలుస్తారు) పనిచేస్తున్నాడు. గ్రామస్తుల నమ్మకం ప్రకారం భువలు దేవతలతో మాట్లాడగలరు, ఆవాహన చేయగలరు. నరేష్ తండ్రి కూడా భువనే. అయితే తన తరంతోనే ఈ క్షుద్ర పూజలు, తాంత్రిక విద్యలు ముగిసిపోవాలని, తన పదేళ్ల కొడుకు ఈ విద్యలు నేర్చుకోకూడదని నరేష్ భావించాడు. కానీ గత కొన్ని నెలలుగా బాలుడి ప్రవర్తన మారడంతో, కొడుకు కూడా తాంత్రికుడిలా మారుతున్నాడని నరేష్ అనుమానించాడు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తుపాన్‌లు అతలాకుతలం చేస్తున్నాయి. మొన్న అర్నబ్ సైక్లోన్ సృష్టించిన బీభత్సం మరవక ముందే.. మురాసు తుపాన్ ముంచెత్తింది. బంగాళాఖాతంలో ఏర్పడిన మురాసు తుపాన్ మంగళవారం తెల్లవారుజామున తీరం దాటింది. దీని ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షా లు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం స్తంభించింది.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

ముంచేసిన 'మురాసు'

- రోడ్డు పనుల్లో విద్యుత్ షాక్
- 8 మంది కార్మికులు మృతి
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం

బంగాళాఖాతంలో ఏర్పడిన మురాసు తుపాన్ తీరాన్ని దాటింది. మంగళవారం తెల్లవారుజామున 3:30 గంటల నుండి 5:30 గంటల మధ్య ఒంగోలు సమీపంలో తీరాన్ని తాకింది. దీంతో బలమైన గాలులు వీస్తున్నాయి. తుపాన్ ప్రభావంతో ఒంగోలు, చీరాల, బాపట్ల తీర ప్రాంతాల్లో గంటకు 120-155 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. బాపట్ల, కృష్ణా, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ (విజయవాడ) జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కొండేపి టంగుటూరు రోడ్డుపై చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షాల నేపథ్యంలో సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో కొల్లామ్ వైజాగ్ ఎక్స్‌ప్రెస్ నిలిపివేశారు.

132 మండలాల్లో..

తుపాన్ ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం, 15 జిల్లాల్లో 30,661 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. కృష్ణా, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో అత్యధిక పంట నష్టం నమోదైంది. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. 15 జిల్లాల్లోని 132 మండలాలను తుపాన్ ప్రభావితం చేసింది.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని సహాయక శిబిరాలకు మొత్తం 10,805 మందిని తరలించారు. నిరాశ్రయులైన ప్రజల కోసం అధికారులు 171 సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. బాధిత ప్రజలకు సుమారు 14,810 ఆహార ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. 11 ఎన్‌డీఆర్ఎఫ్, 13 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. అత్యవసర విద్యుత్ అవసరాల కోసం అధికారులు 613 జనరేటర్లను సిద్ధంగా ఉంచారు. రోడ్లపై చెట్లు పడిపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ చెట్లను తొలగించడానికి అత్యవసర బృందాలను మోహరించారు. కూలిపోయిన చెట్లను తొలగించే పనిలో 185 బృందాలు నిమగ్నమయ్యాయి.

రూట్ మార్చిన హ్యాకర్లు



అక్షరటుడే, నేషనల్ డెస్క్: సైబర్ నేరగాళ్లు తమ దాడుల శైలిని మార్చుకుంటున్నారు. ఇప్పటివరకు కేవలం బ్యాంకింగ్ వ్యవస్థలు, కంప్యూటర్ డేటా, వ్యక్తిగత సమాచారం, ప్రభుత్వ వెబ్‌సైట్లను లక్ష్యంగా చేసుకున్న హ్యాకర్లు.. ఇప్పుడు ఏకంగా భౌతిక యంత్రాలపై దాడులకు దిగుతున్నారు. తాజాగా బెల్జియం, స్వీడన్ సహా పలు ఐరోపా దేశాల్లోని సూపర్‌మార్కెట్ల రిఫ్రిజరేషన్ వ్యవస్థలను హ్యాక్ చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ఫ్రీజర్ల ఉష్ణోగ్రతలను ఏకంగా 50 డిగ్రీల సెల్సియస్ దాటేలా మార్చడంతో టన్నుల కొద్దీ ఆహార పదార్థాలు నాశనమయ్యాయి. గతంలో అమెరికా సైనిక స్థావరాలు, ఫ్రాన్స్‌లోని సూపర్‌మార్కెట్లలోనూ ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడం గమనార్హం.

ఒక్కరోజే రూ.50 వేల కోట్లు జంప్..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ ప్రపంచంలోనే అత్యధికంగా సంపదను పెంచుకున్న బిలియనీర్‌గా సరికొత్త రికార్డు సృష్టించారు. రిలయన్స్ షేర్ల విలువ స్టాక్ మార్కెట్లో దూసుకుపోవడంతో కేవలం ఒకే రోజులో ఆయన సంపద రూ.50,400 కోట్లకు పైగా పెరిగింది. ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం, ఆయన నికర ఆస్తి 7.85 శాతం పెరిగి ఏకంగా రూ.52,920 కోట్ల వృద్ధిని నమోదు చేసింది. ఈ భారీ లాభంతో ముఖేష్ అంబానీ మొత్తం సంపద రూ.7,45,920 కోట్లకు చేరింది. ప్రస్తుతం ఆయన ప్రపంచ సంపన్నుల జాబితాలో 23వ స్థానంలో కొనసాగుతున్నారు.

లేడీస్ హాస్టల్‌లో అగ్ని ప్రమాదం



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ నగరంలోని నాచారం సావర్కర్ నగర్‌లో ఉన్న శ్రీ లక్ష్మి మహిళా హాస్టల్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. హాస్టల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి, వ్యాపించాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్‌లతో మంటలను ఆర్పివేశారు.

ఢిల్లీలో బాణసంచా విక్రయాల పై సుప్రీంకోర్టు ఆందోళన

అక్షరటుడే, ఢిల్లీ : ఢిల్లీలో టపాసుల విక్రయాలపై ఆంక్షలు అమలు కావడం లేదని మీడియాలో వచ్చిన కథనాలపై సుప్రీంకోర్టు మంగళవారం ఆందోళన వ్యక్తం చేసింది. కాలుష్య రహిత, గ్రీన్ టపాసులు మాత్రమే విక్రయించాలని కోర్టు ఆదేశించినా.. అన్ని రకాల క్రాకర్స్ విక్రయాలు చేపడుతున్నట్లు మీడియా నివేదికలు వెల్లడించాయి. సాధారణ టపాసుల అక్రమ అమ్మకం, వినియోగాన్ని నిరోధించడంలో గతంలో విధించిన పూర్తిస్థాయి నిషేధాలు విఫలమయ్యాయని కోర్టు పేర్కొంది. అటువంటి ఉత్పత్తులను తరచుగా 'గ్రీన్ టపాసులు' అనే ముసుగులో అమ్ముతున్నారని కోర్టు గమనించింది.



నేపాల్‌లో ఢీకొన్న హెలీకాప్టర్లు.. ఒకరి మృతి



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : నేపాల్‌లో ల్యాండ్ అవుతుండగా.. రెండు హెలీకాప్టర్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మృతుడిని భారత్‌కు చెందిన వసంత్‌కుమార్‌గా గుర్తించారు. నేపాల్‌లోని మౌంట్ ఎవరెస్ట్ సమీపంలో ఎత్తైన విమానయాన కేంద్రంలో ల్యాండ్ అవుతుండగా హెలీకాప్టర్లు ఢీకొన్నాయి. ల్యాండ్ అవ్వడానికి కొద్ది క్షణాల ముందు రెండు హెలికాప్టర్ల రోటర్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. అనంతరం అవి కింద కూలిపోయాయి.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు.. దంపతుల మృతి



అక్షరటుడే, మెదక్ : సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం అర్ధరాత్రి ఓ కారు అతివేగంగా దూసుకొచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, బోల్తా పడింది. సంగారెడ్డి జిల్లా కంది మండలం కాశింపూర్ గ్రామం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం గాజులగూడ గ్రామానికి చెందిన నర్సింలు (40), ఆయన భార్య మౌనిక (30) రాత్రి పూట కారులో వెళ్తున్నారు. ఆ సమయంలో కారు అదుపు తప్పి డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అనంతరం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరు తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతి చెందారు.

బీఎల్ఎస్ పాలిమర్స్ బ్లాక్‌బస్టర్ లిస్టింగ్



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: బీఎల్ఎస్ పాలిమర్స్ కంపెనీ షేర్లు మంగళవారం స్టాక్ మార్కెట్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాయి. 65 శాతం ప్రీమియంతో లిస్టయ్యాయి. వైర్లు, కేబుళ్లు, భూగర్భ పైప్‌లైన్‌లలో ఉపయోగించే ప్రత్యేక పాలిమర్ సమ్మేళనాలను తయారుచేసే బీఎల్ఎస్ పాలిమర్స్ కంపెనీ మార్కెట్ నుంచి రూ. 255 కోట్లు సమీకరించాలన్న లక్ష్యంతో ఐపీవోకు వచ్చింది. కంపెనీ షేర్లు మంగళవారం ఉదయం 65.33 శాతం లాభంతో రూ. 248 వద్ద లిస్టయ్యాయి.

త్వరలో కోల్ ఇండియా నుంచి మరో ఐపీవో!

అక్షరటుడే, బిజినెస్ డెస్క్: కోల్ ఇండియా తన సబ్సిడరీ అయిన మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌ను పబ్లిక్ ఇష్యూకు తీసుకువస్తోంది. ఈ కంపెనీలో సుమారు 10 శాతం వాటాను కోల్ ఇండియా విక్రయించే అవకాశాలున్నాయి. ఈ మేరకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు డ్రాఫ్ట్ ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఒడిశా పరిధిలో పనిచేసే మహానది కోల్‌ఫీల్డ్స్ విలువ రూ. లక్ష కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇందులో కోల్ ఇండియాకు వందశాతం వాటాలున్నాయి. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా పది శాతం వాటాను విక్రయించడం ద్వారా రూ. 10 వేల కోట్ల వరకు నిధులు సమీకరించాలన్న యోచనతో కోల్ ఇండియా ఉన్నట్లు తెలుస్తోంది.

